‘బరోజ్’ ఓ అద్భుత ఊహాజనిత ప్రపంచం

మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ స్వీయ దర్శకత్వంలో నటించిన ఫాంటసీ అడ్వెంచర్ ‘బరోజ్ 3డి’. ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోని పెరుంబవూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. మైత్రీ మూవీమేకర్స్ ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా శనివారం మోహన్‌లాల్ విలేకరులతో ముచ్చటించారు.

‘బరోజ్’ ఓ త్రీడీ ఫాంటసీ ఫిల్మ్. ఇప్పటివరకూ మలయాళం నుంచి మూడు త్రీడీ సినిమాలే వచ్చాయి. లేటెస్ట్ టెక్నాలజీని వాడుకొని యునిక్‌గా సినిమా చేశాం. అద్భుతంగా వచ్చింది. విజువల్ వండర్‌లా ఉంటుంది. స్టోరీ టెల్లింగ్ కూడా ఆసక్తిగా ఉంటుంది. ‘గార్డియన్ ఆఫ్ ది గామాస్ ట్రెజర్’ అనే నవల ఆధారంగా ఈ ఇమాజనరీ అడ్వెంచర్ కథను రూపొందించాం. నిధి నేపథ్యంలో కథ నడుస్తుంది. ఓపెన్ మైండ్‌తో వచ్చి ఈ ఊహాజనిత ప్రపంచాన్ని ఆస్వాదించాలని కోరుకుంటున్నా

ప్రఖ్యాత హాలీవుడ్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేశారు. హాలీవుడ్ మ్యూజిక్ కంపోజర్ మార్క్ కిల్లియన్ బీజీఎం ఓ కొత్త అనుభూతిని కలిగిస్తుంది. 12ఏళ్ల లిడియన్ నాదస్వరం ఈ సినిమాకు సాంగ్స్ కంపోజ్ చేశాడు. సంతోష్‌శివన్ కెమెరా విజువల్స్ సినిమాకు హైలైట్. గ్రాఫిక్ వర్క్ కూడా అద్భుతంగా ఉంటుంది. యానిమేటెడ్ క్యారెక్టర్లను కూడా క్రియేట్ చేశాం. దర్శకుడిగా తొలి సినిమానే త్రీడీలో చేయడం ఓ సవాల్. ఇది నాకు కొత్త అనుభూతినిచ్చింది. గత 40ఏళ్లుగా ఇలాంటి సినిమా రాలేదు. మైత్రీ మూవీ మేకర్స్ వారు ఈ సినిమాను తెలుగులో విడుదల చేయడం చాలా ఆనందంగా ఉంది.

ఆయన డైరెక్షన్‌లో నటించాలనుంది

‘కాంతారా’ తర్వాత దర్శక, నిర్మాతలంతా రిషబ్ శెట్టి డేట్స్ కోసం క్యూ కడుతుంటే.. ఆయన మాత్రం ఓ డైరెక్టర్‌తో సినిమా చేయాలనుందని ఓ ఇంటర్వ్యూలో ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. ఆ దర్శకుడెవరో కాదు.. మన సందీప్‌రెడ్డి వంగా. వివరాల్లోకెళ్తే.. నటుడు రానా ఓ టాక్‌షోని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ టాక్‌షోను రానా వైరైటీగా ప్లాన్ చేశారు. తను ఏ స్టార్‌ని ఇంటర్వ్యూ చేసినా.. అది సదరు స్టార్ ఇంట్లోనే షూట్ చేయబడుతుందనమాట. ఈ క్రమంలో రిషబ్‌శెట్టిని ఇంటికెళ్లి కలిశారు రానా. ఈ ఇంటర్వ్యూలో భాగంగా తన కిష్టమైన దర్శకుడెవరు? ఎవరి డైరెక్షన్‌లో నటించాలని ఉంది? అని రానా ప్రశ్నించగా.. ‘నాకు సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో నటించాలని ఉంది. తనలా ఎవరూ ఆలోచించరు. ఆయన సినిమాను చూసే దృక్కోణం వేరుగా ఉంటుంది. అందుకే ఆయన డైరెక్షన్‌లో నటించాలని ఉంది. ఆయన చేసే ఏ సినిమాలోనైనా నటించేందుకు నేను సిద్ధం’ అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చేశారు రిషబ్ శెట్టి. మరి రిషబ్ ఎలాగూ ఇంట్రస్ట్ చూపిస్తున్నాడు కాబట్టి సందీప్ ఏవంటాడో చూడాలి.

అనుకున్నట్టే ట్రోల్ చేశారు

మాటల్లో పొరపాట్లు దొర్లడం సహజం. ముఖ్యంగా సినిమాల విషయంలో ఓ పేరుకు బదులు మరో పేరు చెప్పేయడం ప్రతి ఒక్కరికీ జరుగుతూనే ఉంటుంది. ఇటీవల రష్మిక మందన్నా ఓ ఇంటర్వ్యూలో అలాంటి పొరపాటే చేసింది. విజయ్ ‘గిల్లీ’ సినిమా గురించి మాట్లాడుతూ ‘నేను థియేటర్లో చూసిన తొలి సినిమా ‘గిల్లీ’. వెండితెరపై చూసిన తొలి హీరో విజయ్ సార్. అందులోని పాటలంటే నాకు చాలా ఇష్టం. ఆ పాటలకు ఎన్నోసార్లు స్టేజ్‌పై డాన్సులు చేశా.’ అని చెప్పుకొచ్చింది. అంతవరకూ బాగానే ఉంది.. చివర్లో ‘గిల్లీ.. తెలుగులో మహేశ్ సార్ నటించిన ‘పోకిరి’కి రీమేక్’ అని సెలవిచ్చేసింది. నిజానికి ‘గిల్లీ’.. మహేశ్ ‘ఒక్కడు’ సినిమాకు రీమేక్. మరి సోషల్ మీడియా ఊరుకుంటుందా!? ట్రోల్స్ మొదలయ్యాయి. ఆ వీడియో షేర్ చేస్తూ, రష్మికను ఆటపట్టించడం మొదలుపెట్టారు. దాంతో నాలిక కరుచుకున్న మన నేషనల్ క్రష్.. వెంటనే మరో వీడియో పోస్ట్ చేసింది.. ‘గిల్లీ.. ఒక్కడు రీమేక్ కదా.. ఇంటర్వ్యూ అవ్వగానే అనుకున్నా వీడియోను ట్రోల్ చేస్తారని. అనుకున్నట్టే జరిగింది.. నిజంగా సారీ.. ‘పోకిరి’ని అదే పేరుతో తమిళంలో రీమేక్ చేశారుకదా.. నాకు తెలుసు. ఏదేమైనా నాకు వారి సినిమాలన్నీ ఇష్టమే..’ అంటూ ఫన్నీ ఎమోజీలు జోడించింది రష్మిక. ఇదిలావుంటే.. ‘పుష్ప2’ హిట్‌తో మంచి జోష్ మీదున్న ఈ అందాల భామ చేతులో ప్రస్తుతం దక్షిణాదితోపాటు బాలీవుడ్ ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. కుబేరా, ఛావా, సికిందర్, ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రాల్లో ఆమె నటిస్తున్నది.

శరవేగంగా ‘వార్2’

తారక్ ప్రస్తుతం ‘వార్ 2’లోని తన పార్ట్‌ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే ఈ సినిమా చాలా భాగం షూటింగ్ పూర్తయింది. ఇండియాతోపాటు దుబాయ్, మలేషియాలో మూడు షెడ్యూల్స్ పూర్తి చేశారు దర్శకుడు ఆయాన్ ముఖర్జీ. రీసెంట్ షెడ్యూల్‌లో ఎన్టీఆర్ సోలో ఎపిసోడ్స్‌తో పాటు హృతిక్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ షెడ్యూల్‌ని పూర్తి చేసుకొని ఇటీవలే తారక్ హైదరాబాద్ చేరుకున్నారట. ‘దేవర’ షూటింగ్ పూర్తవ్వగానే గ్యాప్ తీసుకోకుండా ‘వార్ 2’ని మొదలుపెట్టేశారు తారక్. ఈ సినిమా పూర్తిచేసి, వెంటనే ప్రశాంత్‌నీల్ ప్రాజెక్ట్‌లోకి ఎంట్రీ ఇవ్వాలి. నిజానికి జనవరి నుంచే ప్రశాంత్ నీల్ సినిమాను పట్టాలెక్కించాలనుకున్నాడు తారక్. కానీ ‘వార్2’ లేట్ అవ్వడంతో ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరికి మారింది. అందుకే ఎట్టిపరిస్థితుల్లో జనవరిలో ‘వార్ 2’కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారాయన. ఆగస్ట్ నుంచి ‘వార్2’ ప్రమోషన్స్ కూడా ఎన్టీఆర్ డేట్స్ ఇవ్వాలి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని యష్‌రాజ్ సంస్థని తారక్ పరుగులు పెట్టిస్తున్నారని వినికిడి.

దేవుడా.. నన్ను మంచికి దూరం చేయకు

స్త్రీ ప్రాధాన్యతతో కూడిన కథలను ఎంచుకుంటూ కథానాయికగా భిన్నమైన ప్రయాణాన్ని సాగిస్తున్నది ఢిల్లీ భామ తాప్సీ పన్ను. ప్రస్తుతం ఆమె ‘గాంధారి’ అనే యాక్షన్ థ్రిల్లర్ చేస్తున్నది. దేవాశిష్ మఖిజా దర్శకత్వంలో కనికా థిల్లాన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ మొదలైంది. పల్లెటూరి యువతిగా ఇందులో తాప్సీ నటిస్తున్నట్టు ఆమె తన ఇన్‌స్టాలో పొందుపరచిన స్టిల్స్ చెబుతున్నాయి. ఇదిలావుంటే.. ఈ సినిమా స్టిల్స్‌తోపాటు ఓ క్యాప్షన్‌ని జత చేసింది తాప్సీ. ‘ప్రియమైన దేవుడా.. నన్నెప్పుడూ మంచికి దూరం చేయకు. నా అభ్యర్థనను మన్నించి నాకు విజయాన్ని కటాక్షించు’ అనేది ఈ క్యాప్షన్ సారాంశం. వచ్చే ఏడాది చివర్లో ఈ సినిమా విడుదల కానుంది.

మనసు బాధగా అనిపించేది

‘2003 ప్రపంచ కప్‌కు నేను తొలిసారి ప్రెజంటర్‌గా వర్క్ చేశాను. అప్పుడు క్రికెట్ లెజెండ్స్ తీరు నన్ను కన్నీళ్లు పెట్టుకునేలా చేసింది..’ అంటూ గుర్తు చేసుకున్నారు బాలీవుడ్ నటి మందిరా బేడీ. ఓ టాక్‌షోలో ఈ విషయం గురించి ఆమె మట్లాడుతూ ‘ఇప్పుడు మహిళలు కూడా క్రీడల్లో గుర్తుంపు తెచ్చుకుంటున్నారు. కానీ ఒకప్పటి పరిస్థితులు వేరు. ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ఆ రోజుల్లో నన్ను క్రికెట్ ప్రెజంటర్‌గా ఎంపిక చేశారు. క్రికెట్ లెజెండ్స్‌తో మాట్లాడి.. వారినుంచి సమాధానాలు రాబట్టడం నా పని. గ్యాలరీలో, గ్రౌండ్‌లో నన్ను చూసి ‘ఈమె ఇక్కడేం చేస్తుంది? ఈ రంగంతో ఈమెకు సంబంధం ఏంటి? అన్నట్టు చూసేవారు. ప్యానల్ డిస్కషన్లో ఏదైనా ప్రశ్న అడిగితే.. సంబంధం లేని సమాధానం ఇచ్చేవారు. మనసు బాధగా అనిపించేది. పక్కకెళ్లి ఏడ్చేసేదాన్ని. తొలివారం అలా చాలా ఇబ్బంది పడ్డా. తర్వాత స్టైల్ మార్చా. అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకపోతే.. ఎదురు ప్రశ్నించడం మొదలుపెట్టా. ఆటోమేటిగ్గా అంతా దారికొచ్చారు..’ అంటూ గుర్తు చేసుకుంది మందిరా బేడీ.

కొత్త కథలకే ప్రాధాన్యం

‘కెరీర్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నా. ‘పొట్టేల్’ సినిమాలో నా నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం కొత్తదనంతో కూడిన కథల్ని ఎంచుకుంటున్నా’ అని చెప్పింది కథానాయిక అనన్య నాగళ్ల. ఆమె కీలక పాత్రలో నటించిన తాజా చిత్రం ‘శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్’. వెన్నెల కిషోర్ టైటిల్ రోల్‌ని పోషించిన ఈ సినిమాకు రైటర్ మోహన్ దర్శకుడు. ఈ నెల 25న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనన్య నాగళ్ల మాట్లాడుతూ ‘ఇప్పటివరకు నేను ఇలాంటి కథ వినలేదు. చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో నేను భ్రమరాంబ అనే పాత్రలో కనిపిస్తా. తన పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుంది. ఆమె చుట్టూ నడిపించిన ప్రేమకథ కూడా ఆసక్తికరంగా అనిపిస్తుంది’ అని తెలిపింది. ‘వకీల్ సాబ్’ సినిమా షూటింగ్ టైంలో పవన్‌కల్యాణ్ తన నటన చూసి మెచ్చుకున్నారని, ఎమోషన్స్‌ను బాగా పండించడంతో పాటు రియల్ పెయిన్ కనిపిస్తున్నదని చెప్పడం ఎంతో ఆనందాన్నిచ్చిందని అనన్య నాగళ్ల పేర్కొంది. ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీలో ఓ ఫీమేల్ ఓరియెంటెడ్ సినిమా చేస్తున్నానని, కథాకళి, లేచింది మహిళా లోకం సినిమాలు త్వరలో రాబోతున్నాయని అనన్య నాగళ్ల చెప్పింది.

‘పుష్ప’ కెరీర్‌కు బ్రేక్‌నిచ్చింది

ఇటీవలే విడుదలైన బ్లాక్‌బస్టర్ మూవీ ‘పుష్ప-2’ చిత్రంలోని టైటిల్‌సాంగ్‌తో పాటు జాతర పాటకు నృత్యరీతుల్ని సమకూర్చి అందరి ప్రశంసలందుకుంటున్నారు కొరియోగ్రాఫర్ విజయ్ పోలాకి. తన కెరీర్‌లో ‘పుష్ప-2’ ఓ మైలురాయిలా నిలిచిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం విజయ్ పోలాకి విలేకరులతో మాట్లాడుతూ ‘‘కొబ్బరిమట్ట’ సినిమా ద్వారా నేను కొరియోగ్రాఫర్‌గా పరిచయమయ్యాను. ఆ తర్వాత ‘పలాస’ చిత్రంలో అన్ని పాటలకు డ్యాన్స్ కంపోజ్ చేశా. అందులో ‘నక్కిలీసు గొలుసు’ పాట చాలా పాపులర్ అయింది. ఆ తర్వాత నా ప్రొఫైల్ చూసి సుకుమార్, అల్లు అర్జున్ ‘పుష్ప’లోని ‘ఊ అంటావా మావ’ పాట కోసం పిలిపించారు. నేను ఇచ్చిన రిహార్సల్స్ చూసి అవకాశమిచ్చారు. ఇక అక్కడి నుంచి కొరియోగ్రాఫర్‌గా నేను వెనక్కి తిరిగి చూసుకోలేదు’ అన్నారు. ‘పుష్ప-2’లో జాతర సాంగ్ గురించి మాట్లాడుతూ ‘సుకుమార్ విజన్‌కు అనుగుణంగా పుష్పరాజ్ పాత్రను అర్థం చేసుకొని గంగమ్మ తల్లి జాతర సాంగ్‌ను కంపోజ్ చేశాను. ఛాయ్ గ్లాస్ స్టెప్, ఫోన్ స్టెప్, భుజాల మీద మంటతో సిగరెట్ ముట్టించుకోవడం...ఇవన్నీ పుష్పరాజ్ క్యారెక్టరైజేషన్ ప్రకారం డిజైన్ చేశాను. నా చిన్నప్పుడు ఊర్లలో జరిగే జాతరలను బాగా గమనించేవాడిని. ఈ పాట విషయంలో ఆ పరిజ్ఞానం కూడా ఉపయోగపడింది’ అన్నారు. తాను చిరంజీవికి పెద్ద అభిమానినని, అయితే డ్యాన్స్ మాస్టర్ కావాలనే కోరిక మాత్రం హీరో రామ్ పోతినేని నృత్యాలను చూడటం వల్లే కలిగిందని, ఈ రెండేళ్ల కాలంలో తాను కంపోజ్ చేసిన పాటలన్నీ సూపర్‌హిట్ అయ్యాయని విజయ్ పోలాకి తెలిపారు. చిరంజీవితో పాటు అగ్ర హీరోలందరి సినిమాలకు పనిచేయాలన్నది తన డ్రీమ్ అని, ప్రస్తుతం సాయిధరమ్‌తేజ్ ‘సంబరాల ఏటిగట్టు’ ‘భైరవం’ ‘మ్యాడ్-2’ హిందీ బేబీ రీమేక్ సినిమాలకు కొరియోగ్రఫీ అందిస్తున్నానని ఆయన చెప్పారు.

నాగసాధు పోరాటాలు

తమన్నా భాటియా ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రెస్టేజియస్ థ్రిల్లర్ ‘ఓదెల 2’. మూడేళ్ల క్రితం వచ్చిన ‘ఓదెల రైల్వే స్టేషన్’ సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి అశోక్ తేజ దర్శకుడు. డి.మధు నిర్మాత. ఇందులో తమన్నా నాగసాధు పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ నాగసాధు అవతారంలో ఉన్న తమన్నా తాజా పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్లో పురైలపై ధైర్యంగా నడుస్తున్న తమన్నాను చూడొచ్చు. ఆకాశంలో ఎగురుతున్న రాబందులు ఈ పోస్టర్‌లో ప్రత్యేక ఆకర్షణ. ఈ సినిమాలో తమన్నాపై భారీ పోరాట సన్నివేశాలు కూడా ఉంటాయని, వాటికోసం ఆమె ప్రొపర్‌గా ట్రైనింగ్ కూడా తీసుకున్నదని, అత్యున్నత సాంకేతిక విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనున్నదని మేకర్స్ తెలిపారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్.సింహా, యువ, నాగమహేశ్, వంశీ, గగనవిహారి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్.ఎస్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: సంపత్ నంది, నిర్మాణం: మధు క్రియేషన్స్, సంపత్‌నంది టీమ్‌వర్క్స్

నువ్వు గుద్దితే ముద్దు పెట్టినట్టున్నదే..

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ప్రేమకథాచిత్రం ‘డ్రింకర్ సాయి’. ‘బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్’ అనేది ఉపశీర్షిక. ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్నారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమాలోని పాటను విడుదల చేశారు. ‘నువ్వు గుద్దితే ముద్దు పెట్టినట్టున్నదే.. నువ్వు తన్నితే వెన్నె పూసినట్టున్నదే.. నువ్వు రక్కితే చక్కిలిగింత పుడుతున్నదే.. నువ్వు తొక్కితే థాయ్ మసాజ్ చేసినట్టున్నదే.. ’ అంటూ సాగే ఈ పాటను చంద్రబోస్ రాయగా, శ్రీవసంత్ స్వరపరిచారు. జెస్సీ గిఫ్ట్ ఆలపించారు. హీరోయిన్‌ని టీజ్ చేస్తూ హీరో పాడే ఈ పాట సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్.ఎస్.కాంచి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి.

100కోట్లు ఇచ్చినా చేయను

ఒకప్పటి అందాల తార అమీషా పటేల్‌కి కోపం వచ్చింది. ‘గదర్2’ దర్శకుడు అనిల్‌శర్మపై అంతెత్తు లేచింది. వివరాల్లోకెళ్తే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో అనిల్ శర్మ మాట్లాడుతూ ‘గదర్ 2’లో అత్తగా నటించేందుకు అమీషా అంగీకరించలేదని, నర్గీస్ దత్ లాంటి మహానటీమణులు చిన్న వయసులోనే వృద్ధ పాత్రలు పోషించారని ఎంత నచ్చజెప్పినా.. ఆమె మాత్రం చేయను గాక చేయనన్నదని ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై అమీషా వివరణ ఇస్తూ.. ‘డియర్ అనిల్.. అది జీవితం కాదు. కేవలం సినిమా. కాబట్టి తెరపై నేను ఏం చేయాలి? ఏం చేయకూడదు అనేది పూర్తిగా నా వ్యక్తిగతం. ‘గదర్’ కోసమే కాదు, ఏ సినిమా కోసమైనా సరే.. అత్తయ్య పాత్రలు నేను చేయను. వందకోట్లు ఇచ్చినా అలాంటి పాత్రలకు అంగీకరించను. మీరంటే నాకెంతో గౌరవం. దాన్ని తగ్గించుకోవద్దు.’ అంటూ ఘాటుగా స్పందించింది అమీషా.